ఈనాడు
ఏలూరు
బుధవారం అక్టోబరు 2, 2024 7

పర్యావరణ పరిరక్షణకు కలిసి సాగుదాం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ఇందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి, అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం నగరంలో సైకిల్ ప్రదర్శన నిర్వహించారు. జూట్‌మిల్లు కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మినీ బైపాస్ మీదుగా వట్లూరు ఇంజినీరింగ్ కళాశాల వరకు ప్రదర్శన చేపట్టారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. డీఆర్వో పుష్పమణి జెండా ఊపి ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతపై అందరికీ అవగాహన కల్పించడంతోపాటు వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జడ్పీ సీఈవో సుబ్బారావు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 68.26 యూనిట్లను షెడ్యూలు చేసుకుని ఇప్పటివరకు 6,699 యూనిట్లలో కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, నగర కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి తదితరులు

95 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం సాయంత్రానికి 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. నగరంలోని శాంతినగర్ సచివాలయం-2 పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మొదటిరోజే నూరు శాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 2,64,966 మందికి గాను సాయంత్రం 4 గంటలకు 2,52,089 మందికి పింఛన్లు అందజేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తదితరులున్నారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్షకు ఏర్పాట్లు

☛ జిల్లాలో రెండు కేంద్రాలు ☛ హాజరుకానున్న 5,670 మంది అభ్యర్థులు



ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకు జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనుండగా 5,670 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఆన్‌లైన్లో పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు అధికారులను నియమించారు. ప్రతి 300 మందికి ఒక విభాగాధికారిని (డీవో) నియమించారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. దివ్యాంగ తదితర కేటగిరీలకు చెందిన 32 మంది అభ్యర్థులకు సహాయకులను (స్క్రైబ్‌లు) నియమించారు.

కేంద్రం	తేదీలు	అభ్యర్థుల సంఖ్య ఉదయం	మధ్యాహ్నం
సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల, వట్లూరు	3-21 వరకు	2,965	2,505
సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, వట్లూరు	6	100	100

ఈ నెల 11, 12 తేదీల్లో ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో పరీక్షలు జరగవు.

వేళలు: ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు | మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు

కేంద్రాల వద్ద 144 సెక్షన్.. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్. అబ్రహం తెలిపారు. అన్ని కేంద్రాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు నిర్ణీత వేళకు కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారని వివరించారు.

సహాయ కేంద్రం ఏర్పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఏమైనా సమస్యలుంటే 83281 86618, 90307 23444 నంబర్లకు ఫోన్ చేసి తెలపవచ్చని డీఈవో అబ్రహం చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డుతో హాజరు కావాలన్నారు. పరీక్ష ప్రారంభ సమయానికి కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్లలో ఏమైనా తప్పిదాలు దొర్లితే పరీక్ష కేంద్రం వద్ద ఒరిజినల్ ధ్రువపత్రాలు సమర్పించి నామినల్ రోల్స్‌లో సరిచేయించుకోవచ్చన్నారు.

గ్రామ స్వరాజ్యానికి.. స్వచ్ఛ అడుగులు

కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు ఊపిరి | స్వచ్ఛతా హీ సేవకు ప్రాధాన్యం



ఈనాడు, ఏలూరు: దేశానికి పల్లెలే పట్టుగొమ్మలన్నారు మహాత్ముడు.. గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమని దృఢంగా విశ్వసించారు. గత వైకాపా అయిదేళ్ల పాలనలో బాపూజీ కలలను కల్లలు చేసి గ్రామ ప్రగతిని పాతాళానికి నెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పల్లె ప్రగతికి పట్టాభిషేకం జరుగుతోంది. గ్రామసభల నిర్వహణ, అభివృద్ధికి నిధుల కేటాయింపు, స్వచ్ఛతా హీ సేవ వంటి కార్యక్రమాల ద్వారా పురోగతికి పెద్దపీట వేశారు.

సంపూర్ణ పారిశుద్ధ్య సాధనకు.. కూటమి ప్రభుత్వం పల్లెల్లో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించడానికి గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపట్టింది. సెప్టెంబర్ 17 నుంచి 30 వరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 11,857 అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించారు. వాటిలో ఇప్పటి వరకు 11,195 ప్రాంతాలను స్థానికుల సహకారంతో శుభ్రపరిచారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం బాగుంటేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్న ఉద్దేశంతో వారితోపాటు కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేయించారు.

మంచి రోజులొచ్చాయ్.. గత వైకాపా సర్కారు పంచాయతీలను గాలికొదిలేసింది. వాటికి కేంద్రం ఇచ్చిన నిధులను ఇతర పథకాలకు మళ్లించారు. కనీసం పంచాయతీలకు విద్యుత్తు బకాయిలు కూడా చెల్లించని దారుణాలు కళ్లకు కట్టాయి. పంచాయతీ సిబ్బంది ఉండగానే ప్రత్యామ్నాయంగా సచివాలయాలను ఏర్పాటు చేశారు. నిధులు దోచేస్తున్నారని సర్పంచులు రోడ్లపై ధర్నాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పంచాయతీలకు ప్రాధాన్యం పెరిగింది.

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు చిన్న పంచాయతీలకు రూ.15 వేలు, పెద్ద పంచాయతీలకు రూ.25 వేలు వంతున ఇచ్చారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు రూ.1.18 కోట్లు వచ్చాయి. ఉమ్మడి పశ్చిమలోని 941 సంపద సృష్టి కేంద్రాలను తిరిగి తెరుస్తున్నారు. తాగునీటి పథకాల నిర్వహణకు పెద్దపీట వేస్తున్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టి గ్రామాలను అగ్రపథానికి నడిపిస్తున్నారు.

పల్లె ప్రగతికి పట్టం కూటమి సర్కారు అధికారం చేపట్టిన వెంటనే పంచాయతీల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి పశ్చిమకు రూ. 294.5 కోట్ల ఉపాధి నిధులు కేటాయించారు. వీటిని ప్రజల వ్యక్తిగత సౌకర్యాలు, పంచాయతీ అవసరాలు, అంతర్గత రహదారుల ఏర్పాటు, నీటి సంరక్షణ చర్యల కోసం వినియోగిస్తారు. సీసీ, బీటీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఉద్యాన పంటల అభివృద్ధి, పశువుల షెడ్లు ఏర్పాటు, పాఠశాలల ప్రహరీలు, కల్వర్టుల నిర్మాణం, శ్మశానాల్లో దహన వాటికల ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం గ్రామ సభల ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటారు.

	ఏలూరు	పశ్చిమ
చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలు	5,919	5,938
పూర్తి చేసిన పనులు	5,604	5,591
సంపద కేంద్రాలు	541	400
పంచాయతీలు	547	409
మొత్తం కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)	220	74.5
ఒక్కో నియోజకవర్గానికి కేటాయింపు (రూ.కోట్లలో)	20	7

అవస్థల విస్తరణ

ఏళ్లుగా కొనసాగుతున్న ఏలూరు-పెరికీడు రహదారి పనులు

పెదపాడు, న్యూస్‌టుడే

విషయం: ఏలూరు- పెరికీడు ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ. గత తెదేపా ప్రభుత్వ హయాంలో పనులకు అనుమతులు ఇచ్చారు.

దూరం	అంచనా వ్యయం	పర్యవేక్షణ
18.14 కి.మీ.	రూ.58.27 కోట్లు	ఆర్‌అండ్‌బీ శాఖ

పనులు ప్రారంభం: 2021 జనవరి

ప్రయోజనం: ఏలూరుతో పాటు కృష్ణా జిల్లా ప్రజలకు ఉపయోగకరం


పాతపెదపాడు నుంచి గండిచెరువు గట్టు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

ప్రగతి ఇలా.. వంగాయగూడెం నుంచి పెదపాడు మండలం మీదుగా పెరికీడుకు రహదారిని విస్తరించేందుకు పనులు చేపట్టారు. ప్రారంభంలో ఇరువైపులా ఉన్న మహావృక్షాలను కూకటి వేళ్ల సహా పెకిలించి వాటిని నరికి అమ్మేశారు. అనంతరం 11 కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. కానీ పూర్తిగా నిర్మించలేదు. కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించకుండా వదిలేశారు. పెదపాడు, తోటగూడెం, వసంతవాడ, పెరికీడు గ్రామాల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వంతెనలు నిర్మించాల్సిన చోట ఇంకా పనులు ప్రారంభించలేదు.

తాజా పరిస్థితి.. పనులు నిలిచిపోయి సంవత్సరం గడిచినా నేటికీ ప్రారంభం కాలేదు. ఇక వర్షం కురిస్తే రహదారిపై ప్రయాణం సాహసమే అవుతుంది. దారి మొత్తం గోతులమయం కావడంతో నీరు నిలిచి అవి కనిపించక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇది నిత్యకృత్యంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేందుకు పక్కకు వెళ్తే రహదారి అంచుల్లో కూరుకుపోయి చోదకులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.


కొత్తూరు వద్ద కల్వర్టుకు రక్షణ గోడలు ఏవీ?

ప్రజల వినతి.. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలి.


అసంపూర్తిగా ఏలూరు-కృష్ణా కాలువకు అడ్డుగోడ నిర్మాణం

★ 'ఇప్పటివరకు చేసిన పనులకు సంబంధించి రూ.31 కోట్లకు పైగా బిల్లులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు వాటిని నిలిపేశారు. బిల్లుల విషయం ఉన్నతాధికారులకు తెలిపాం.. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. అసంపూర్తి కల్వర్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈలోగా తాత్కాలిక మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.' అని ఆర్‌అండ్‌బీ ఏఈ శేషుకుమార్ తెలిపారు.

గిరిజనానికి ప్రగతి వెలుగులు

పీఎం జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ ద్వారా అడుగులు



బుట్టాయగూడెం, కుక్కునూరు, న్యూస్‌టుడే: సరైన సదుపాయాలకు నోచుకోక, అభివృద్ధికి ఆమడ దూరంలో ఆవేదనకరంగా ఉన్న గిరిజన గ్రామాల్లో ప్రగతి వెలుగులు ప్రసరించనున్నాయి. ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకం ద్వారా అభివృద్ధి పథంలో పయనించనున్నాయి. రానున్న అయిదేళ్లలో సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ అమలు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నవంబరు నుంచి పనులు చేపడతారు.

25 రకాల అభివృద్ధి పనులు.. జిల్లాలో ఈ పథకం అమలు కోసం తొలి విడత 46 గ్రామాలు ఎంపిక చేశారు. మన్యంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలతో పాటు మైదానంలోని టి.నరసాపురం, చింతలపూడి, నూజివీడు, చాట్రాయి మండలాల్లోని గిరిజన గ్రామాలను ఎంపిక చేశారు. వాటిలో 25 రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందుకు గాను ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి సమస్యలు గుర్తించనున్నారు. ఈ నెలాఖరు లోగా వాటిని గుర్తించాలి. కనీసం 500 మంది జనాభా కలిగి, అందులో 50 శాతం మంది గిరిజనులు ఉన్న రెవెన్యూ గ్రామాల్లో పథకం కింద నిధులు కేటాయించి వెచ్చిస్తారు.

☛ పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రాగానే గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించి, అనుమతుల కోసం నివేదికలు పంపనున్నట్లు కేఆర్‌పురం ఐటీడీఏ ఏపీవో పీవీఎస్ నాయుడు తెలిపారు.

మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాలు	
బుట్టాయగూడెం	19
పోలవరం	5
జీలుగుమిల్లి	5
వేలేరుపాడు	9
కుక్కునూరు	2
టి.నరసాపురం	1
చింతలపూడి	2
నూజివీడు	2
చాట్రాయి	1

రామన్నగూడెం పంచాయతీలో అక్రమాలు

రూ.20 లక్షలు స్వాహా చేసినట్లు ఫిర్యాదు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం పంచాయతీలో గత మూడేళ్ల వ్యవధిలో సుమారు రూ. 20 లక్షలు అక్రమాలు జరిగాయంటూ గ్రామానికి చెందిన కొత్తపల్లి రమేశ్ సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మీకోసం'లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో పేర్కొన్న వివరాల మేరకు.. గతంలో పనిచేసిన కార్యదర్శులు నాగరాజు, కృష్ణవేణి, పంచాయతీ సర్పంచి కలిసి ఎటువంటి తీర్మానాలు, ఎంబుక్‌లు లేకుండా పంచాయతీ ఖాతా నుంచి నిధులు కాజేశారని ఆరోపించారు. 2019 మే నుంచి 2024 వరకు దస్త్రాలు పరిశీలిస్తే అక్రమాలు బయటపడతాయని పేర్కొన్నారు. గతంలో రావుల చెరువులో ఇటుక బట్టీకి సంబంధించి నిర్వాహకుడి నుంచి రూ.5 లక్షలు వసూలు చేసి సొంతానికి వాడుకున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దుర్వినియోగమైన సొమ్మును రికవరీ చేయడంతోపాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ★ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పదేళ్లుగా పనిచేస్తున్నానని, ఏడాది కాలానికి వేతనం రావాల్సి ఉంది. ఈ సొమ్మును గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి నాగరాజు కాజేశాడని గ్రామానికి చెందిన కొత్తపల్లి సహదేవుడు ఫిర్యాదు చేశారు. వేతనం సొమ్ము ఇప్పించాలని కోరారు.

ఇక ప్రైవేటుకే మద్యం అమ్మకాలు

● ఉమ్మడి జిల్లాలో 319 దుకాణాలకు దరఖాస్తులు ● ఈ నెల 9 వరకు గడువు.. కసరత్తు చేస్తున్న అధికారులు



ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చింది. గతంలో మద్యం రిటైల్ వ్యాపారం ప్రైవేటుగా నిర్వహించగా.. వైకాపా అధికారంలోకి వచ్చాక దాన్ని మార్చేసి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్యం విక్రయాలను చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్ని మార్చేసింది. మద్యం రిటైల్ వ్యాపారం తిరిగి ప్రైవేటుగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. దీన్ని మంగళవారం నుంచే అమల్లోకి తీసుకొచ్చింది. దరఖాస్తుల ఆహ్వానం, టెండర్ల ప్రక్రియ నిర్వహించి త్వరితగతిన దుకాణాల్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు షెడ్యూలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను అనుసరించి ప్రణాళిక అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 319 మద్యం దుకాణాలున్నాయి. వీటికి మంగళవారం నుంచి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 9వ తేదీ వరకు స్వీకరించి 11న కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి అభ్యర్థులకు లైసెన్సులు ఖరారు చేస్తారు. లైసెన్సులు దక్కించుకున్న వారు 12వ తేదీ నుంచే దుకాణాలను ప్రారంభించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దరఖాస్తుదారు రూ.2 లక్షల డీడీ తీయాలి. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించవచ్చు. ఆయా ప్రాంతాల్లోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలో కూడా దరఖాస్తులు ఇచ్చే వెసులుబాటు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..	ఏలూరు	పశ్చిమ	మొత్తం
మద్యం దుకాణాలు	144	175	319
బార్ అండ్ రెస్టారెంట్లు	16	24	40
ఎక్సైజ్ స్టేషన్లు	07	06	13
సిబ్బంది	130	170	300

వ్యాపారుల ఆసక్తి.. గతంలో మద్యం దుకాణాలు నిర్వహించిన వ్యాపారులు, ఆశావహులు దుకాణాలు దక్కించుకునేందుకు ముందుకు వస్తున్నారు. గతంలో ఏళ్ల తరబడి మద్యం దుకాణాలు నిర్వహిస్తూ, ఆయా దుకాణాల్లో పని చేస్తూ ఉపాధి పొందిన వారంతా వైకాపా పాలనలో రోడ్డున పడ్డారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించడంతో సిబ్బందికి పనిలేక బతుకుదెరువు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం నూతన విధానంతో వారికి ప్రాణం లేచి వచ్చినట్లైంది.

పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ, కేటాయింపు.. దరఖాస్తుల స్వీకరణ, టెండర్ల ప్రక్రియ అంతా పారదర్శకంగా ఉంటుంది. కలెక్టర్ సమక్షంలో టెండర్లు తీసి లైసెన్సు దారులను ఖరారు చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను అనుసరించి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు శాఖాపరంగా అధికారులను ఆదేశించాం. – బి.శ్రీలత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు


మాట్లాడుతున్న ధాత్రిరెడ్డి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ముందస్తు ప్రణాళికలో భాగంగా మంగళవారం మండల ప్రత్యేకాధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరణలో ఎదురయ్యే ఇబ్బందులను ప్రత్యేకాధికారులు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చింతలపూడి, ఉంగుటూరు, జంగారెడ్డిగూడెం మండలాలకు ఆర్డీవోలు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. నిడమర్రు మండలానికి జడ్పీ సీఈవో, దెందులూరుకు జిల్లా వ్యవసాయాధికారి, పెదపాడుకు మత్స్య శాఖ జేడీ, భీమడోలుకు డీఆర్‌డీఏ పీడీ, పెదవేగికి డీసీవో, పోలవరానికి వయోజన విద్య డీడీ, ముదినేపల్లికి డ్వామా పీడీ ప్రత్యేకాధికారులుగా ఉంటారని వివరించారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీలక్ష్మి, డీఎస్‌వో సత్యనారాయణరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ట్రాఫిక్ మళ్లింపు
నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు
8లో

కొబ్బరి సూదకు గిరాకీ

పెరిగిన ధర.. పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు

● అయిదడుగుల పైబడి ఉండే కొబ్బరి మొక్క సరిగ్గా గత ఏడాది ఇదే రోజుల్లో రూ. 13 పలికేది. ప్రస్తుతం అదే సైజు మొక్క రూ. 24కు ధర పెరిగిందంటే కొబ్బరిసూదకు పెరిగిన గిరాకీ తెలుసుకోవచ్చు. జిల్లాలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో కొబ్బరి నర్సరీలు ఎక్కువగా ఉన్నాయి. పెరిగిన ధరలతో పొరుగు రాష్ట్రాలకు కొబ్బరి మొక్కలు ఎక్కువగా ఎగుమతవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.


పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: నర్సరీల్లో లభించే వివిధ పరిమాణాల ఎత్తు మొక్కల్లో రెండు అడుగుల ఎత్తు మొక్కలకే ఎక్కువ మొగ్గు చూపుతుంటారు. రవాణాకు తేలిగ్గా ఉండటంతోపాటు భూమిలో బలంగా నాటుకుంటుందనే ఉద్దేశంతో చిన్న మొక్కలనే ఎక్కువగా నాటుతుంటారు. 2023 సెప్టెంబర్‌లో ఈ మొక్క ధర రూ. 12 పలకగా ప్రస్తుతం రూ. 23 ఉంది. పెద్ద మొక్కలకు చిన్న మొక్కలకు ధర వ్యత్యాసం ఒక్క రూపాయి మాత్రమే ఉండటం గమనార్హం.


కొబ్బరి మొక్కలు ఎగుమతి చేస్తున్న కూలీలు

ఎగుమతులు ఎక్కడికంటే.. ప్రస్తుతం జిల్లా నుంచి కొబ్బరిసూదను అసోం, పశ్చిమ బంగా, బీహార్, గుజరాత్ రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నట్లు యలమంచిలి మండలం అడవిపాలెంనకు చెందిన నర్సరీ యజమాని బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. లారీకి పెద్దవి పది వేల మొక్కల వరకు, రెండు అడుగుల మొక్కలైతే 20 వేలకు పైగా ఎగుమతి చేస్తుంటామని ప్రస్తుత సీజన్‌లో పాలకొల్లు, వరిధనం, పెనుమదం గ్రామాల నుంచి నెలకు సరాసరిన 20 లారీల సూద ఎగుమతి జరుగుతుందన్నారు.

పెరిగిన ధరలతో ఊరట.. గత ఏడాది కొబ్బరికాయలకు సరైన ధరలు రాక చాలామంది నిల్వలు పోశారు. వాటిలో మొక్క కాయలను కొందరు రైతులు వేరు చేసి స్వయంగా మొక్కల కోసం పాతగా.. వ్యాపారులు తక్కువ ధరల్లో నర్సరీలను తయారు చేశారు. ప్రస్తుతం కొబ్బరితోపాటు మొక్కలకు గిరాకీ రావడంతో రైతులకు, వ్యాపారులకు కొంత ఊరట లభించింది.

పచ్చగా.. పది మందికి చెప్పేలా..


వృక్షంపై ప్రకృతిమాత


మొక్కను బతికించు.. చిత్రంతో..

చెట్టును కాపాడు.. చెట్టు రక్షించు.. అనే నినాదంతో తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల ఆవరణలోని చెట్లపై విద్యార్థులు అందమైన వర్ణచిత్రాలను వేశారు. ఇవి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణానికి మేలుచేసే వృక్షాలను పరిరక్షించేందుకు తమవంతు కృషిచేస్తున్నారు. వీటిని చూసిన ఇతర కళాశాల విద్యార్థులు పచ్చదనం పరిరక్షణకు తమవంతు కృషిచేస్తామని చెబుతున్నారు. - ఈనాడు, తణుకు.


పాండా, బుద్ధుని చిత్రాలు


మర్రిచెట్టు కాండంపై రంగులేసి సెల్ఫీ పాయింటుగా మలిచారిలా..

నిబంధనలకు అనుగుణంగా ధ్రువపత్రాల జారీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అసైన్డ్ భూములు, కుల ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జారీ చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ అమరావతి నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. అసైన్డ్ భూముల పరిశీలన, ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. అనంతరం జిల్లాలోని రెవెన్యూ అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్‌పై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలన్నారు. సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి తదితర అధికారులు పాల్గొన్నారు.


వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి తదితరులు

* ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వివేక్ యాదవ్ మంగళవారం రాష్ట్ర రాజధాని నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ 98.68 శాతం పూర్తయిందన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలకు 82,851 దరఖాస్తులు అందాయని తెలిపారు.

కేంద్ర పథకాల అమలుపై ఆరా

ఉంగుటూరు, న్యూస్‌టుడే: కాగుపాడు, వీఏపురం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్, గృహ నిర్మాణ సంస్థ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను జాతీయస్థాయి (ఎన్ఎల్ఎం) బృందం సభ్యులు సూర్యకాంత్ ప్రధాన్, అశోక్ కుమార్ సాహు మంగళవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పని ప్రదేశంలో పని వేళ, అందిన వేతనం, ఖర్చుల వివరాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మస్టర్లలో పొరపాట్లపై ఏపీవో మల్లేశ్వరరావును ప్రశ్నించారు. డ్వాక్రా జాబ్‌కార్డులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పింఛన్లు ఎన్ని ఉన్నాయి, అర్హులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. ఎంపీడీవో రాజ్‌మనోజ్, తహసీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు

ఇంటి స్థలం ఆక్రమించుకుంటున్నారని మనస్తాపం
పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న మహిళ మృతి

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: తన ఇంటి స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మనస్తాపం చెందిన ఓ మహిళ ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరు మండలం కొవ్వలికి చెందిన దేవినేని రామతులసి(53)కి గ్రామంలో 493 గజాల స్థలం ఉంది. గుడివాడ మండలం నాగవరప్పాడుకు చెందిన దొడ్డవరపు కోటేశ్వరరావు, అతని భార్య నిర్మలకుమారి రామతులసి సంతకాలను ఫోర్జరీ చేసి ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారికి వల్లభనేని సాయికృష్ణ సహకరించాడు. ఈ క్రమంలో రామతులసి కోర్టులో కేసు వేసింది. రెండు రోజుల కిందట ఆ స్థలంలోని మోటారు, కొన్ని వస్తువులను కోటేశ్వరరావు దంపతులు తీసుకెళ్లారు. రామతులసి వారిపై దెందులూరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. కోటేశ్వరరావు దంపతులు రామతులసి, ఆమె కుమారుడిపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం కోటేశ్వరరావు, నిర్మలకుమారి వివాదాస్పద స్థలం వద్దకు వచ్చి పనులు చేపట్టేందుకు యత్నించారు. రామతులసి అడ్డుకుంది. వారు దుర్భాషలాడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన రామతులసి తన ఇంటి వద్దకు వెళ్లి పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు మంటలను ఆర్పి చేసి 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకురాగా ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది.

జైల్లో మగ్గిపోనక్కర్లేదు!

తెలిసో తెలియకో క్షణికావేశంలో కొందరు నేరాలు చేస్తుంటారు. జైళ్లలో మగ్గిపోతుంటారు. కొందరు రిమాండ్ ఖైదీలుగా, మరికొందరు శిక్ష పడిన ఖైదీలుగా కారాగార గోడల మధ్య గడుపుతుంటారు. న్యాయవాదులు ఏర్పాటుచేసుకుని డబ్బు ఖర్చు పెట్టుకునే స్తోమత ఉన్నవారు బెయిల్ తెచ్చుకుని బయటపడుతుంటారు, డబ్బులేనివారు అక్కడే ఉండిపోతుంటారు. చిన్న చిన్న నేరాలకే జైలుకు వెళ్లినా.. బెయిల్ తీసుకుని బయటకు వచ్చే కేసులే అయినా వెసులుబాటు తెలియక, న్యాయవాదిని పెట్టుకోలేక అలాగే ఉండిపోతుంటారు. అలాంటి వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుంది. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా వారికి కావాల్సిన న్యాయ సహాయం అందిస్తుంది. ఇలా ఎంతో మంది ఖైదీలను జైళ్ల నుంచి బయటకు తీసుకొస్తున్నారు. అయితే సరైన అవగాహన లేక చాలా మంది పేద ఖైదీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారు.



ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది పేద ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా న్యాయ సహాయం అందిస్తోంది. దీనిపై అవగాహన కల్పించేందుకు సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా జైల్లో ఖైదీలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ఖైదీలకు సదుపాయాలు, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటూ ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేస్తూ వారికి మేలు చేకూరేలా.. వారి హక్కులు వారు తెలుసుకుని అవి పొందేలా సహాయ సహకారాలు అందిస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారు.


ఏలూరులోని జిల్లా జైల్లో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ (పాత చిత్రం)

ఎంతో మందికి విముక్తి

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను 2023 జనవరిలో ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో పేద ఖైదీలు 177 మందికి న్యాయ సహాయం అందించారు. ఈ ఏడాది ఇలా 113 మంది సాయం పొందారు.. వీరిలో సెషన్స్ కేసుల్లో 42 మంది, క్రిమినల్ కేసుల్లో 42 మంది, సాధారణ కేసుల్లో 25 మందికి బెయిల్ మంజూరైంది.

అర్హులెవరంటే...

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయ సహాయానికి పేదలు అర్హులు. సంవత్సరాదాయం రూ.3 లక్షలకు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఇది వర్తించదు. అవగాహన లేక.. న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. న్యాయ సాయంతో పాటు వైద్య సహాయం అందిస్తారు. సేవలు అందించేందుకు చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబరు ఒకరు, అసిస్టెంట్ కౌన్సిల్ మెంబర్లు ఇద్దరు పనిచేస్తున్నారు. వీరు కేసులను వాదించి ఖైదీలకు బెయిల్ మంజూరయ్యేలా చేస్తుంటారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

పెదవేగి, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నుంచి 6వ తేదీ వరకు పెదవేగి గురుకుల బాలుర పాఠశాల మైదానంలో అండర్-19 విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభాకరరావు, కె.జయరాజు తెలిపారు. సాఫ్ట్‌బాల్, థ్రో బాల్ పోటీలు జరుగుతాయని, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పోటీలను ప్రారంభిస్తారన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ) కోర్సుల్లో భర్తీ చేయని సీట్లకు ఈ నెల ఐదో తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం (ప్రధాన ప్రాంగణం), కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. యూనివర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఉదయం 9.30 నుంచి 11 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

కాల్‌మనీ వ్యవహారంలో వడ్డీ వ్యాపారిపై కేసు

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: కాల్‌మనీ వేధింపులకు సంబంధించి ఏలూరుకు చెందిన వడ్డీ వ్యాపారి మేడేపాటి సుధాకరరెడ్డి, అతని భార్య లావణ్య, అనుచరుడు విద్యాసాగర్, రాజేశ్, మరికొందరిపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణపువీధికి చెందిన సుబ్బలక్ష్మి, రాజేశ్ దంపతులు 2011లో సుధాకరరెడ్డి వద్ద అప్పు తీసుకుని చెల్లించారు. తరువాత బట్టల వ్యాపారం నిమిత్తం రూ.1.20 లక్షలు అప్పుగా తీసుకున్నారు. వారం వారం రూ.5 వేలు వడ్డీ చెల్లించే పద్ధతి ప్రకారం విడతల వారీగా రూ.8.75 లక్షలు కట్టారు. అప్పు తీర్చేశామని నిశ్చింతగా ఉన్నారు. కాగా, అప్పు తీసుకున్నప్పుడు ఇచ్చిన చెక్కులు, నోట్లు అడ్డం పెట్టుకుని ఇంకా డబ్బులు ఇవ్వాలని సుధాకర్ రెడ్డి, అతని భార్య తదితరులు బెదిరింపులకు పాల్పడ్డారు. మానసికంగా వేధిస్తూ, దౌర్జన్యాలకు దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూగజీవాల్ని తరలిస్తున్న లారీ పట్టివేత

పెదపాడు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మూగజీవాలను అక్రమంగా తరలిస్తున్న లారీని మంగళవారం పట్టుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుధాకరరాజు తెలిపారు. తుని నుంచి చిలకలూరిపేటకు 13 ఆవు దూడలను అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కలపర్రు టోల్‌ప్లాజా వద్ద లారీని గుర్తించి పట్టుకున్నామన్నారు. ఆవుదూడలను ఏలూరు గోశాలకు తరలించి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

వినూత్న పరిశోధనలపై దృష్టి సారించండి

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వినూత్న పరిశోధనలపై దృష్టి సారించాలని వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి గోపాల్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌పై రెండు రోజుల అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వరంగల్ నిట్ కేంద్ర గ్రంథాలయ మాజీ గ్రంథపాలకుడు కె.వీరాంజనేయులు వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో ఇ-వనరులపై అవగాహన కల్పించారు. వివిధ విభాగాల డీన్‌లు నారాయణ నాయుడు, కేబీవీ రమణ, సూర్యకుమారి, రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పరిశోధన సంచాలకులు మాధవి, విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో తెదేపా, జనసేన వర్గీయుల ఘర్షణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు మండలం పైడిచింతపాడులో పింఛన్ల పంపిణీకి సంబంధించి తెదేపా, జనసేన వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. సర్పంచి తిమోతీ, మాజీ సర్పంచి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మోరు హైమావతి, సుబ్బారావు, కొంత మంది ఇటీవల వైకాపా నుంచి జనసేనలో చేరారు. ఈ క్రమంలో మంగళవారం జనసేన, తెదేపా నాయకులు పింఛన్లు తాము పంపిణీ చేస్తామంటే తామంటూ గొడవ పడ్డారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో పింఛన్ల పంపిణీ సాయంత్రం వరకు ఆగింది. గొడవ ఎంతకూ సద్దుమణగకపోవడంతో సిబ్బంది సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్సైలు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. ఎట్టకేలకు సాయంత్రం పింఛన్లు పంపిణీ చేశారు.

స్నానానికి వెళ్లి విగతజీవిగా మారి
చెరువులో మునిగి యువకుడి మృతి

గోపవరం(కైకలూరు), న్యూస్‌టుడే: స్నానం కోసం చెరువులో దిగిన యువకుడు మృతి చెందిన ఘటన కైకలూరు మండలం గోపవరంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కైకలూరుకు చెందిన గోపాలపురపు నారాయణ (19) ఇంటర్ చదివి రెండేళ్ల నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. స్నానం చేసేందుకు మంగళవారం సాయంత్రం స్నేహితులతో గోపవరం ఓఎన్‌జీసీ రోడ్డులోని రజకుల చెరువు వద్దకు వెళ్లాడు. చెరువులో దిగిన వెంటనే నీట మునిగిపోయాడు. నారాయణను కాపాడేందుకు అతని స్నేహితుడు గుణా యత్నించగా.. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోతున్న గుణాను స్థానికులు గుర్తించి ఒడ్డుకు చేర్చారు. గ్రామస్థులు రెండు గంటల పాటు చెరువులో గాలించగా నారాయణ మృతదేహం లభ్యమైంది. గుణా అస్వస్థతకు గురవడంతో కైకలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కైకలూరు పట్టణ ఠాణా సీఐ పి.కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మరొకరు.. **లింగపాలెం, న్యూస్‌టుడే:** విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన లింగపాలెం మండలం నరసన్నపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కె.సుధీర్‌బాబు(24) ఇంట్లో విద్యుత్తు సరఫరా ఆగిపోవడంతో డాబాపైకి ఎక్కి తీగలు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు లింగపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సుధీర్‌బాబుకు తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు.


సుధీర్‌బాబు (పాతచిత్రం)

దసరా ఉత్సవాలు... ట్రాఫిక్ మళ్లింపు
విజయవాడ మీదుగా నడిచే వాహనాల రాకపోకల్లో మార్పులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా.. నగరం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు ఈ మళ్లింపులు ఉంటాయని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

భారీ, చిన్న వాహనాలు ఇలా వెళ్లాలి..

✦ హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, స్వాతి కూడలి, కనకదుర్గా పైవంతెన, కృష్ణలంక, కనకదుర్గమ్మ వారధి, తాడేపల్లి మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

✦ హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను.. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై.కూడలి, కబేలా సెంటర్, సీవీఆర్ పైవంతెన, పైపులరోడ్డు, కండ్రిక, బోడపాడు ఆర్‌యూబీ, ఔటర్ రింగ్‌రోడ్డు, ముస్తాబాద, చిన అవుటుపల్లి మీదుగా విశాఖపట్నం మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

✦ గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను బుడంపాడు, తెనాలి, పెనుమూడి వారధి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు, విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గుంటూరు, కనకదుర్గమ్మ వారిధి, బెంజిసర్కిల్ పైవంతెన, రామవరప్పాడు, నిడమానూరు, గన్నవరం మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

✦ విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనమూడి వారధి, రేపల్లె, చీరాల, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గన్నవరం, నిడమానూరు, బెంజిసర్కిల్, కనకదుర్గమ్మ వారిధి మీదుగా చెన్నైకు పంపిస్తారు. రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగితే.. తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా బందరురోడ్డు, అక్కడి నుంచి బెంజిసర్కిల్ మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.

‘ఆదాయం వస్తుందని తప్ప.. వ్యక్తిగత ప్రయోజనంతో చేర్చలేదు’

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పురపాలక సంఘానికి ఆదాయం సమకూరుతుందన్న ఉద్దేశంతోనే 359 సర్వే నంబరులోని రుద్రరాజు గంగరాజు వేసిన లేఅవుట్ అంశాన్ని కౌన్సిల్ దృష్టికి తెచ్చామని, అందులో ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనం లేదని పురపాలక ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మంగళవారం పేర్కొన్నారు. 9.40 ఎకరాల్లోని రెండు లేఅవుట్లలో 14 శాతం పన్ను కట్టించుకుని భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చే అంశాన్ని సోమవారం నిర్వహించిన పురపాలక సమావేశం అజెండాలో చేర్చడంపై కౌన్సిలర్లు అభ్యంతరం తెలుపుతూ విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేసిన విషయం విదితమే. ఈ విషయమై ఛైర్‌పర్సన్ వివరణ ఇస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2006లో అప్పటి సర్పంచి, కార్యదర్శి ఈ లేఅవుట్‌కు అనుమతులు ఇచ్చారన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు
రూ.40 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం

గణపవరం, న్యూస్‌టుడే : అంతర్ జిల్లా ద్విచక్ర వాహనాల దొంగను గణపవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గణపవరం పోలీస్ స్టేషన్‌లో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కొయ్యలగూడెం మండలం గవరవరానికి చెందిన చప్పిడి ముసలయ్య, గణపవరం మండలం ముగ్గళ్లకు చెందిన శెట్టి చిన్నాలు చెడు వ్యసనాలకు బానిసయ్యారు. వీరిద్దరు ముఠాగా ఏర్పడి గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో రూ.40 లక్షల విలువైన 45 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను అపహరించారు. సెప్టెంబరు 23న గణపవరం పోలీసులు శెట్టి చిన్నాను అరెస్టు చేసి రూ.22 లక్షల విలువైన 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని జైలుకు పంపారు. పరారీలో ఉన్న చప్పిడి ముసలయ్య కోసం గాలించగా మంగళవారం పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్టు చేసి రూ.18 లక్షల విలువైన 16 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు, ఆటోను రికవరీ చేయడంలో ప్రతిభ చూపిన గణపవరం ఎస్సై మణికుమార్, సిబ్బంది శంకర్, హేమసుందర్, కాంతయ్య, రత్నబాబు, సత్యనారాయణ, హోంగార్డు జగపతి బాబులను డీఎస్పీ అభినందించారు.


రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసు సిబ్బంది

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

విదేశీ నగదు ఇస్తామని మోసం
* 24 గంటల్లోనే కేసు ఛేదన..
* నిందితుల అరెస్టు

నరసాపురం, న్యూస్‌టుడే: ఒక వ్యక్తికి విదేశీ నోట్లు ఇస్తామని నమ్మించి మోసగించిన కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. దీనికి సంబంధించి నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన రాపాక చంద్రరావు గతంలో గల్ఫ్ వెళ్లి వచ్చారు. ఈ అనుభవంతో విదేశాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి విదేశీ కరెన్సీ నోట్లు, సెంటు సీసాలు, కళ్లజోళ్లు తదితర సామగ్రిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారు. ఇతని వ్యాపారం బాగా సాగుతుండటంతో అదే గ్రామానికి చెందిన గల్ఫ్ నుంచి వచ్చిన మేడిది వెంకటరెడ్డి కూడా ఇదే వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య వైరం ఏర్పడింది. దీంతో చంద్రరావు ఏలూరు జిల్లా కలిదిండి వెళ్లి అక్కడ వ్యాపారం చేస్తున్నారు. అక్కడ కూడా వ్యాపారం బాగుండటంతో అసూయ చెందిన వెంకటరెడ్డి అతని వ్యాపారాన్ని నిరోధించాలని కొంతమందితో కలిసి కుట్రపన్నారు. దీంట్లో భాగంగా ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ సూర్యతేజ, భయ్యా హిమసాగర్ ఒక బృందంగా, కోరుకొండ గిరిబాబు, గంగరాజు, జవ్వాడి మలికిబాబు మరో బృందంగా ఏర్పడి చంద్రరావుపై దాడికి కుట్రపన్నారు. వారి పథకం ప్రకారం చంద్రరావుకు గత నెల 30న వెంకటరెడ్డి ఫోన్ చేసి తనవద్ద రూ.2 లక్షల విదేశీ కరెన్సీ ఉందని, వాటిని విక్రయిస్తానని నమ్మబలికాడు. మొగల్తూరు పోలీసుస్టేషన్ పరిధి రాజుగారి తోట వద్దకు రావాలని చెప్పాడు. విదేశీ కరెన్సీ కోసం రూ.2 లక్షల నగదు తీసుకుని చంద్రరావు వచ్చాడు. ప్రభు తేజ, మణికంఠ సూర్యతేజ, హిమసాగర్‌లు వచ్చి రూ.2 లక్షల నగదు లాక్కుని చంద్రరావుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్పీ, అడిషినల్ ఎస్పీ ఆధ్వర్యంలో నరసాపురం గ్రామీణ సీఐ దుర్గాప్రసాద్, మొగల్తూరు ఎస్ఐ జి.వాసు సిబ్బందితో కలిసి లాడ్జిలు, ఇతర ప్రాంతాల్లో గాలించారు. నిందితులు ఏడుగురు పట్టణంలోని ఓ లాడ్జిలో ఉండగా గుర్తించి అరెస్టు చేసి రూ.1.70 లక్షల నగదు, ఖతార్‌కు చెందిన రియాల్ నోట్లు పది, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించిన పోలీసుల బృందాన్ని డీఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. **5.35** పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: 27వ డివిజన్ ఆర్టీవో కార్యాలయం వెనుక చిన సాయిబాబా గుడి వద్ద నివాసాల ముందున్న వీధి దీపం వారం రోజులుగా వెలగడం లేదు. **- రామారావు, సాయిబాబా గుడి రోడ్డు**

సమాధానం: సిబ్బందితో వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: మెయిన్‌బజారు కత్తేపువీధి కూడలి వద్ద దూదేకుల వారి వీధిలో దాసాంజనేయస్వామి ఆలయం వద్ద డ్రెయిన్లో నెలల తరబడి పూడిక తీయడం లేదు. నివాసాల ముందు మురుగు నిల్వ ఉంటోంది. **- వెంకటరత్నం, దూదేకులవారి వీధి**

సమాధానం: సిబ్బందితో డ్రెయిన్లో పూడిక తొలగిస్తాం. **- భానుప్రతాప్, నగర పాలక అధికారి**

సమస్య: వన్‌టౌన్ బెనర్జీపేట బీజీటీవో పాఠశాల రోడ్డులో మురుగు పారడం లేదు. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. **- పి.వెంకటేశ్, వ్యాపారి**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- శివారెడ్డి, ఉప నగరపాలక అధికారి**

ఉంగుటూరు, న్యూస్‌టుడే

సమస్య: నారాయణపురం అరుంధతి కాలనీలో ఇటీవల కొత్త విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఒక స్తంభానికి వీధి దీపం పక్కకు బిగించడంతో కాంతి ఒక వైపునకే వస్తోంది. **- శ్రీను, స్థానికుడు**

పరిష్కారం: పరిశీలించి వీధి దీపాన్ని సరిచేయిస్తాం. **- నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**

స్పందనకు వందనం

వీధి దీపం వెలిగింది.. ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: సత్రంపాడు హౌసింగ్‌బోర్డు కాలనీ రెండో రోడ్డులో వీధి దీపాన్ని వెలిగించారు. ఈ విషయమై ఈ నెల ఒకటిన ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పూడిక తీశారు.. ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఏలూరు బావిశెట్టివారిపేట శ్రీరామకాలనీ మొదటి రోడ్డులోని కాలువలో పూడిక తీశారు. ఈ సమస్యపై గత నెల 27న ప్రచురితమైన వార్తకు నగర పాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించి సిబ్బందితో పనులు చేయించారు.

నగరంలో ఈనాడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే

● ఉదయం 9.30 గంటలకు: ఆర్ఆర్ పేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగర పాలకోన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో ఉద్యమ అధ్యయన తరగతులు.

దసరాకు ప్రత్యేక బస్సులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీపీటీవో వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టామన్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి జిల్లాకు చేరుకోవడానికి ఈ నెల 8 నుంచి 11 వరకు బస్సులు నడుపుతామన్నారు. అలాగే దసరా పండగ మరుసటి రోజు ఈ నెల 13వ తేదీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణానికి అదనపు రుసుం చెల్లించనవసరం లేదన్నారు. రానుపోను ఒకేసారి టికెట్ బుక్ చేసుకునే వారికి పది శాతం రాయితీ కల్పిస్తామని వివరించారు. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనార్థం మూలా నక్షత్రం రోజు నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

మురుగుతో సహవాసం..
ఆరోగ్యంతో చెలగాటం!
వసతిగృహాల సముదాయంలో అపరిశుభ్రత

ఆ ప్రాంతం బాలికల వసతిగృహాల సముదాయం. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం.. డ్రెయిన్లలో మురుగు పారకుండా ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. విద్యార్థినులు నిత్యం అలాంటి పరిసరాల్లోనే గడపాల్సి వస్తోంది. ఈ కారణంగా రోగాల భయం వారిని వెంటాడుతోంది. ఉన్నతాధికారులు పలుమార్లు మందలించినా సిబ్బంది తీరు మారడం లేదు. ఇదీ ఏలూరులోని అమీనాపేట బాలికల వసతిగృహాల సముదాయం వద్ద నెలకొన్న దుస్థితి.

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే

సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహాలను అమీనాపేటలోని ఒకే ప్రాంతంలో పక్కపక్కనే ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. పాఠశాల నుంచి కళాశాల వరకు చదివే విద్యార్థినులు వసతి పొందుతున్నారు. ఆ చెంతనే సంక్షేమ శాఖ జేడీ కార్యాలయం ఉంది. అయినా పరిసరాలు ఎప్పుడూ అపరిశుభ్రంగానే ఉంటాయి. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ గతంలో బాలికల వసతిగృహాన్ని సందర్శించి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, విద్యార్థులు రోగాల బారిన పడతారని.. వెంటనే శుభ్రపరచాలని వసతి గృహం అధికారులను ఆదేశించారు. అలాగే ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి వసతిగృహాన్ని తనిఖీ చేసి పరిసరాలను మెరుగు పరచాలని ఆదేశించారు. అయినా వసతిగృహ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. అక్కడి పారిశుద్ధ్య పరిస్థితుల్లో మార్పు రాలేదు.

ఇలా వచ్చి అలా వెళ్తారు

నిత్యం పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు పట్టనట్లుగా ఉండటం వల్లే వసతి గృహ ప్రాంగణాలిలా తయారయ్యాయని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వారు సమయపాలన పాటించకుండా ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంటారన్నారు. వంట వాళ్లు, కొందరు విద్యార్థినులకు బాధ్యతలు అప్పగించి వదిలేస్తుంటారనే ఆరోపణ ఉంది. ఇక్కడ స్వచ్ఛ కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

రోగాల బారిన విద్యార్థినులు

వసతిగృహ సముదాయంలోని డ్రెయిన్లలో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దుర్వాసనతోపాటు దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. ఈ కారణంగా విద్యార్థినులు రోగాల బారిన పడుతున్నారు. పిల్లలను ఆసుపత్రుల చుట్టూ తిప్పుతున్నామని, వారు సరిగా చదవలేకపోతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు చెబుతున్నారు.



ఆవరణలోని డ్రెయిన్లో నిలిచిన మురుగు

చర్యలు తీసుకుంటాం.. ‘వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. వసతిగృహ అధికారులు ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తాం. అలాగే సముదాయంలోని డ్రెయిన్లలో మురుగు పారేలా పూడిక తీయిస్తాం. విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం’ అని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎ.సందీప్, డి.సందీప్

గణపవరం, న్యూస్‌టుడే: ఏలూరులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో గణపవరం మండలం పిప్పర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.జయవెంకటేశ్వర్లు తెలిపారు. అండర్-14 విభాగం పోటీల్లో అల్లాడి సందీప్, దాసరి సందీప్‌లు సత్తా చాటారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ ఏవీవీఆర్ ప్రసాద్, విద్యార్థులను మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు, సర్పంచి కాకర బేబి తదితరులు అభినందించారు.



రుత్తమ్మతో హెచ్ఎం పద్మజ, శిక్షకుడు దుర్గాప్రసాద్

జూడో పోటీల్లో ప్రతిభ.. ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: తిరుపతిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో పోణంగి ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.రుత్తమ్మ వెండి పతకం సాధించినట్లు జూడో శిక్షకుడు కె.దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. క్రీడాకారిణిని ప్రధానోపాధ్యాయిని పద్మజ, సిబ్బంది అభినందించారు.



కవ్వకుంటలో పింఛన్ అందజేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



వృద్ధురాలికి సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఆర్థిక సంక్షోభంలోనూ పింఛన్ల పెంపు

కవ్వకుంట (పెదవేగి), న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారులకు రూ.4 వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పింఛను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం కవ్వకుంటలో మంగళవారం ఆయన కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. తెదేపా పెదవేగి మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, నియోజకవర్గ జనసేన, భాజపా, తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పంపిణీ.. ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అధికారంలోకి రాగానే పింఛన్ల పెంపు హామీ నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరంలోని 30, 32 డివిజన్లలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడంతో పాటు లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందజేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, తెదేపా నాయకులు వెంకటరత్నం, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరులోని 131, 132, 177 బూత్‌ల పరిధిలో మంగళవారం ఉదయం సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. 5వ డివిజన్ ఇన్‌ఛార్జి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తెదేపా నాయకులు కంపా విఠల్, దాలి రాజు, పరసా రాంబాబు, ప్రసాద్, గంగాధరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

దెందులూరు న్యూస్‌టుడే: కొవ్వలిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ సోమవారం తనిఖీ చేశారు. అప్పుడు వసతి గృహంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. సత్వరమే పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ క్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు జయప్రకాష్ మంగళవారం దగ్గరుండి వసతిగృహంలో పనులు చేయించారు. డ్రెయినేజీ వ్యవస్థ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. దసరా సెలవుల్లోగా పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. మురుగు బయటకు వెళ్లేలా డ్రెయిన్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ వసతిగృహ నిర్వహణపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి రంగనాయకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ మంత్ర పఠనం



మంత్రం పఠిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా చేపట్టిన ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో ఓం నమో నారాయణ మంత్రం పఠించారు. శ్రీవారిని దర్శించుకున్నారు. తెదేపా మండల అధ్యక్షుడు పాతూరి విజయ్‌కుమార్ ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు, వీర మహిళలు మంగళవారం ఓం నమో నారాయణ మంత్రాన్ని పఠించారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు.

నేత్రపర్వంగా నగరోత్సవం.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జూట్‌మిల్లు సమీపంలోని ధర్మభేరి ప్రాంగణంలో నారా శేష దంపతులు నిర్వహిస్తున్న శ్రీనివాస వైభవోత్సవాల్లో మంగళవారం వేంకటేశ్వరస్వామి నగరోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మహిళల కోలాట ప్రదర్శన, మేళతాళాల నడుమ ఉత్సవం సాగింది. భక్తులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నగరోత్సవం

బాల్య వివాహాలతో అనర్థాలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: బాలల హక్కుల న్యాయవాద ఫౌండేషన్ (సీఆర్ఏఎఫ్) ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై మంగళవారం ఉప్పాకపాడు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామాజిక కార్యకర్త చమటపల్లి రేఖ బాల్య వివాహాల రహిత గ్రామంగా తీర్చిదిద్దుదామని ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం నక్కా సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలయోగి సేవలు ఎనలేనివి

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: బడుగు, బలహీనవర్గాలకు బాలయోగి చేసిన సేవలు ఎనలేనివని జడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శ్రీనివాస్ కొనియాడారు. కైకరంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతిని నిర్వహించారు. బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచి సలగాల గోపి, నాయకులు ఘంటశాల తిరుపతిరావు, లింగంపల్లి పండు, యెగ్గిన శ్యామల తదితరులు పాల్గొన్నారు.

చెరువు నిండా గుర్రపుడెక్క



నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను పెద్ద చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయి తాగునీరు కలుషితమవుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. ఆ నీటితో స్నానం చేస్తే దురదలు వస్తున్నాయంటున్నారు. ఈ నెల 3 నుంచి దేవీ నవరాత్రులు ప్రారంభం కానుండగా.. భవానీ మాల ధరించిన వారు చెరువులోనే స్నానాలు చేస్తారు. కలుషిత నీటితో స్నానం చేస్తే ఎక్కడ అనారోగ్య సమస్యలు వస్తాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. గుర్రపు డెక్కను తొలగించి చెరువును మంచినీటితో నింపాలని కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి సునంద మాట్లాడుతూ గుర్రపుడెక్కను తొలగిస్తామని తెలిపారు.

మొక్కే కదా అని వదిలేస్తే..



భీమడోలు, న్యూస్‌టుడే: భవనాలు, వంతెనలపై పెరిగే రావి, మర్రి చెట్లు వాటి పటిష్ఠతను దెబ్బతీస్తాయి. మొక్కలు ఉన్నప్పుడే తొలగించకుంటే నష్టం వాటిల్లుతుంది. 16వ నంబరు జాతీయ రహదారిపై పలు గ్రామాల కూడళ్ల వద్ద నిర్మించిన పైవంతెనల రక్షణ గోడలపై రావి మొక్కలు పెరిగి వేళ్లూనుకుంటున్నాయి. వాటి వేర్లు గోడల్లోకి చొచ్చుకుపోయి బీటలు వారే ప్రమాదముంది. ఆశ్రం వైద్యశాల కూడలి వద్దనున్న పైవంతెనతో పాటు పలు వంతెనల గోడలపై ఇలా మొక్కలు పెరుగుతున్నాయి. మొక్కలుగా ఉన్నప్పుడే సంబంధిత అధికారులు స్పందించి తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దు



నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చర్యలు ఆపాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని చూడటం సరికాదన్నారు. పరిశ్రమ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, ఏఐవైఎఫ్ నాయకుడు రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శివ, పీడీఎస్‌యూ నాయకుడు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

3న నిరసన దీక్ష.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు 3న చేపట్టే నిరసన దీక్షలో పాల్గొనాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక అన్నేభవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్రం వైఖరిలో మార్పు రాలేదన్నారు. సెయిల్‌లో విలీనం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు రాజనాల రామ్మోహనరావు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న హబీబ్ బాషా

పెదపాడు, పెదవేగి, నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, రైతులు దానిపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు. మంగళవారం పెదపాడు మండలం కొక్కిరపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీతో జరిగే లాభాలను వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంట కోతల సమయానికి అనుకూలంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు వరి పంట పొలాలను పరిశీలించారు. ఏడీఏ వై.సుబ్బారావు, పెదపాడు మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు. ● పెదవేగి మండలం రామసింగవరం, కూచింపూడి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ముత్యాల ప్రియాంక ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు సాగులో మెలకువలను వివరించారు. ● నిడమర్రు మండలం చానమిల్లి, బావాయిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారిణి గీతాదేవి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

పాఠశాలకు గడ్డి కోసే యంత్రం వితరణ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: కైకరం ఉన్నత పాఠశాల ఆవరణలో పచ్చగడ్డి పెరిగిపోవడంతో విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కైకరానికి చెందిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు గడ్డి కోసే యంత్రాన్ని మంగళవారం హెచ్ఎం గుళ్ల ప్రసాదరావుకి అందజేశారు. రాంప్రసాద్ చౌదరి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

బోధనాభ్యసన సామగ్రి పంపిణీ.. నిడమర్రు, న్యూస్‌టుడే: పత్తేపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నవోదయ, ఎన్ఎంఎంఎస్, 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మంగళవారం బోధనాభ్యసన సామగ్రిని సొసైటీ మాజీ అధ్యక్షుడు పత్సమట్ల లక్ష్మీపతిరాజు అందజేశారు. రూ.15 వేల విలువచేసే సామగ్రిని యుగంధర పెద్దిరాజు ఇచ్చారు. ఎమ్మెల్యే ధర్మరాజు తండ్రి లక్ష్మీనారాయణరాజు, పొత్తూరి నరసింహరాజు, ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ సేవల ఆదాయం పెంచుతాం.. గణపవరం, న్యూస్‌టుడే: పార్శిల్ సేవల ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం చేకూరి సంస్థ మరింత బలోపేతం అవుతుందని ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జీఎల్‌పీవీ సుబ్బారావు అన్నారు. గణపవరం ఏపీబీని ఆయన సందర్శించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నెలకు రూ.50 లక్షల ఆదాయం వస్తుండగా, రాబోయే రోజుల్లో పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు.. ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో, ఆంధ్ర హాస్పటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వృద్ధులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బడేటి చంటి హాజరయ్యారు. వైద్యులు జి.సుమంత్, సుబ్బారావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జి.మాణిక్యాలరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు.. దెందులూరు న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటారు. మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో శ్రీలత, సర్పంచి ఏసమ్మ, కార్యదర్శి శ్రీనివాస చౌదరి, అధ్యాపకులు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.. ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలూరులో కాల్‌మనీ పేరుతో ప్రజలను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ నాయకులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎ.రవి, పి.కిశోర్ మాట్లాడుతూ అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా బాధిత మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధుల చట్టాలపై అవగాహన.. ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ మంగళవారం పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. వసతి గృహం పరిసరాలను మెరుగుపరచాలని, పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. వృద్ధులకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా ఉచితంగా అందిస్తామన్నారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.. ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు అన్నారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణను పరిశుభ్రం చేశారు. విద్యార్థినులకు టీషర్టులు పంపిణీ చేశారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకరరావు, జిల్లా యువజన అధికారి డి.కిశోర్, ఇన్‌ఛార్జి ప్రధానాచార్యురాలు సరళ తదితరులు పాల్గొన్నారు.

వాహన ర్యాలీ.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను, డీజీఎం సోమయాజులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ 4జి సేవలతో పాటు వైఫై స్పీడ్ ఇంటర్నెట్ సేవలు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం.. దెందులూరు, న్యూస్‌టుడే: దెందులూరు ఉన్నత పాఠశాలలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆరో తరగతి విద్యార్థి బుగ్గ దుర్గాప్రసాద్ తల్లికి ఉపాధ్యాయులు మంగళవారం రూ.19,200 ఆర్థిక సాయం అందజేశారు. దుర్గాప్రసాద్ మంగళగిరిలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు తమ వంతు సాయం అందించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

పెదవేగి, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజయరాయి, నడిపల్లి గ్రామాల పరిధిలోని తమ్మిలేరు నుంచి ఇసుక తరలిస్తుండగా జానంపేట పంచాయతీ ప్రకాష్‌నగర్ వద్ద పట్టుకున్నామన్నారు.

జూద స్థావరంపై దాడి.. పెదవేగి, న్యూస్‌టుడే: మండలంలోని కొండలరావుపాలెంలో జూద స్థావరంపై మంగళవారం దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.42,800 స్వాధీనం చేసుకున్నామన్నారు.

కారును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం.. పెదపాడు, న్యూస్‌టుడే: పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సువర్ణరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు నవాబుపేటకు చెందిన విప్పర్తి కిరణ్‌కుమార్ ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. మంగళవారం ద్విచక్ర వాహనంపై హనుమాన్ జంక్షన్ వెళుతుండగా టోల్‌ప్లాజా వద్ద ముందు వెళ్తున్న కారును ఢీకొన్నారు. కిరణ్‌కుమార్‌కు గాయాలు కావడంతో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి: జడ్జి



విద్యార్థులతో మాట్లాడుతున్న మధుబాబు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్జి మధుబాబు అన్నారు. చింతలపూడిలోని బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. మరుగుదొడ్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు, వసతి గృహాల ప్రిన్సిపల్స్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన గోదారమ్మ

పోలవరం, న్యూస్‌టుడే: పరివాహక ప్రాంతాల ప్రజలకు మూడు నెలల పాటు ఉగ్రరూపం చూపించిన గోదారమ్మ నెమ్మదించింది. దీంతో ఊరట చెందుతున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం 28.72 మీటర్లకు తగ్గింది. 48 గేట్ల ద్వారా 2.88 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నట్లు జలవనరుల శాఖాధికారులు చెప్పారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బదిలీ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి పారుదల విభాగం బుట్టాయగూడెం మండల ఏఈ సిరిపురపు మురళీకృష్ణ కొయ్యలగూడేనికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం ఆయనకే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి : 76759 19086

పోలవరం, న్యూస్‌టుడే

సమస్య: పోలవరం పంచాయతీ పరిధి కొత్తపేట కాలనీలో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతున్నాయి. సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. భయంతో కర్రలు కట్టి పైకి లేపాం.

-డి.అప్పారావు, కొత్తపేట కాలనీ

సమాధానం: సిబ్బందిని పంపి వెంటనే తీగలు సరిచేయిస్తాం.

-కె.సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఏఈ, పోలవరం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: రేచర్ల ప్రభుత్వ పాఠశాల సమీపంలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితే నీరు నివాసాల మధ్య నిలుస్తోంది.

-రామాంజనేయులు, స్థానికుడు

సమాధానం: మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. అప్పటి వరకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

-మురళీకృష్ణ, ఎంపీడీవో

గురుకులం విద్యార్థులు.. క్రీడల్లో మెరుపులు!

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం గిరిజన గురుకుల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. వాలీబాల్, కబడ్డీల్లో నియోజకవర్గ, జోనల్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తూ మంచి గుర్తింపు సాధిస్తున్నారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, అందుకు అనుగుణంగా స్ఫూర్తిదాయకమైన కృషి చేస్తున్నారు. వారికి వ్యాయామ ఉపాధ్యాయులు తామా వెంకటేశ్, ప్రసాద్‌లు అవసరమైన తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.



కబడ్డీలో శిక్షణ పొందుతూ..

ఇంజినీర్ అవుతా..



'మాది కుక్కునూరు మండలం బంజర గూడెం. పదో తరగతి చదువుతున్నా. నాన్న రాంబాబు తాపీ మేస్త్రి, అమ్మ వెంకమ్మ గృహిణి. బర్రింకలపాడులో గురుకుల పాఠశాలల జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమంగా నిలిచా. తాడేపల్లిగూడెంలో గతేడాది జరిగిన ఉమ్మడి జిల్లాల స్థాయి పోటీల్లో ప్రథమంగా నిలిచి. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. అరకు వ్యాలీలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నా. జాతీయ స్థాయిలో ఆడటంతో పాటు భవిష్యత్తులో ఇంజినీరు కావాలన్నది నా లక్ష్యం'అని సరియం జంపు తెలిపారు.

సైన్యంలో చేరతా



'మా స్వగ్రామం జీలుగుమిల్లి మండలం టి.గంగన్నగూడెం. తల్లి కమల గృహిణి, తండ్రి బాబూరావు రైతు. తొమ్మిదో తరగతి చదువుతున్నా. వాలీబాల్‌లో బర్రింకలపాడులో జోనల్, తాడేపల్లిగూడెంలో ఉమ్మడి జిల్లాల స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతులు సాధించా. అరకు వ్యాలీలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ బహుమతి అందుకున్నా. సైన్యంలో చేరాలన్నది నా లక్ష్యం'అని కొర్సా మహీధర్ చెప్పారు.

పోలీసు అధికారినవుతా



'తొమ్మిది తరగతి చదువుతున్నా. పెదపాడు స్వగ్రామం. తండ్రి విజయ్‌కుమార్ చేపల చెరువు వద్ద పనిచేస్తారు. తల్లి ఉమ గృహిణి. బర్రింకలపాడులో జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించా. విజయనగరం జిల్లా పి.కోనవలసలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి అందుకున్నా. పోలీసు అధికారి కావాలన్నది నా లక్ష్యం'అని తుమ్మలాడ సిద్ధూ పేర్కొన్నారు.

ఐపీఎస్ లక్ష్యం



'పదో తరగతి చదువుతున్నా. నా స్వగ్రామం వేలేరుపాడు మండలం కొయిదా. తల్లి బేబి గృహిణి. తండ్రి సత్తిబాబు రైతు. బర్రింకలపాడులో నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించా. విజయనగరం జిల్లా పి.కోనవలసలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించా. ఐపీఎస్ అధికారి కావాలన్నది నా లక్ష్యం'అని ముచ్చిక విష్ణుసారథి చెప్పారు.

జాతీయ స్థాయిలో ఆడాలని..



'మాది పోలవరం మండలం వెంకటరెడ్డిగూడెం. పదో తరగతి చదువుతున్నా. అమ్మ కృష్ణవేణి గృహిణి, నాన్న దొరబాబు రైతు. బర్రింకలపాడులో జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ, విజయనగరం జిల్లా పి.కోనవలస రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతులు సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో ఆడాలని, ఐపీఎస్ అధికారి కావాలన్నది నా లక్ష్యం'అని తాతి కల్యాణ్ తెలిపారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి



బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

చింతలపూడి, న్యూస్‌టుడే: గుర్తింపు కార్డులున్న కౌలు రైతులకు ఎటువంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఆర్బీఐ నిబంధనల మేరకు రూ.1.60 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వొచ్చని, క్షేత్రస్థాయిలో రూ.50 వేలు ఇవ్వడం గగనమవుతోందన్నారు. దీంతో వ్యాపారుల నుంచి ఎక్కువ వడ్డీకి రుణం తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆందోళన అనంతరం బ్యాంకు మేనేజర్ కె.సుధీర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దొంతా కృష్ణ, పి.జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

'విధుల నుంచి తొలగించడం తగదు'

టి.నరసాపురం, న్యూస్‌టుడే: విచారణ చేయకుండా ఆశా కార్యకర్తను విధుల నుంచి తొలగించడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు అన్నారు. గండిగూడెం ఆశా కార్యకర్త లక్ష్మీమంగను విధుల్లోకి తీసుకోవాలంటూ టి.నరసాపురంలో అయిదో రోజు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అయిదు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా జిల్లా స్థాయి వైద్యాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే విచారణ చేసి, తగు చర్యలు చేపట్టకపోతే జిల్లా స్థాయిలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టంపై టి.నరసాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై ఎం.జయబాబు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహార పట్టిక సక్రమంగా అమలు చేయాలి: ఎమ్మెల్యే

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఆహార పట్టికను సక్రమంగా అమలు చేయాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. భోజన సరఫరా హాజరులో వ్యత్యాసంతో పాటు నాణ్యత లేని పదార్థాలు పెడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఇప్పటి వరకు ఉన్న గుత్తేదారులను అధికారులు తొలగించారు. వారి స్థానంలో స్నేహ ఏజెన్సీకి సరఫరా బాధ్యతలు అప్పగించారు. తొలి రోజు ఆహార పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. నాణ్యమైన భోజనం పెట్టడంతో పాటు హాజరులో అవకతవకలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని



జంగారెడ్డిగూడెం: పింఛను పంపిణీ చేస్తున్న రోషన్‌కుమార్

లోవకుమారి, నాయకులు రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, పరిమి సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, కరుటూరి రమాదేవి, షేక్ ముస్తఫా, అల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు.. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని తాండ్రపాపారాయుడు విగ్రహం కూడలిలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని.. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. దేవులపల్లి, లక్కవరం గ్రామాల్లోనూ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ నరేంద్రకుమార్, ఎంపీడీవో గోపాలకృష్ణ, నాయకులు సాయిల సత్యనారాయణ, రావూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు మరింత భరోసా

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సామాజిక పింఛన్ల నగదు పెంపుతో ఎన్డీయే ప్రభుత్వం పేదల జీవితాలకు మరింత భరోసా కల్పించిందని ట్రైకార్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెం, లక్ష్మడుగూడెం, మావిళ్లవారిగూడెం గ్రామాల్లో మంగళవారం ఆయన ద్వారా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. నాయకులు మొగపర్తి సోంబాబు, మడకం రామలక్ష్మి, యంట్రప్రగడ శ్రీనివాసరావు, ఆలపాటి దుర్గారావు, గద్దే అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడులో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్డీయే



బర్రింకలపాడులో నగదు అందజేస్తున్న బాలరాజు

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కుక్కునూరు, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని విశ్వసించిన ప్రజల ఆశలు ఫలిస్తుండటంతో వారంతా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. వంద రోజుల పాలనపై మంగళవారం కుక్కునూరు మండలం ఉప్పేరులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అనుభవం, పవన్‌కల్యాణ్ పట్టుదల వెరసి రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర ట్రైకార్ బోర్డు ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. నాయకులు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఏసుబాబు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా భ్రమరాంబమల్లేశ్వరస్వామి గ్రామోత్సవం



నంది వాహనంపై స్వామి వారు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మాస శివ రాత్రి సందర్భంగా ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడు భ్రమరాంబమల్లేశ్వరస్వామి గ్రామోత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు హారతి ఇచ్చి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు దర్శించుకున్నారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

విజయ దుర్గమ్మకు పంచామృతాభిషేకాలు.. జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల ప్రారంభం సందర్భంగా పట్టణంలోని విజయదుర్గమ్మకు మంగళవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఎం.రాధాకృష్ణ, ప్రతినిధులు మాడా రామ్మోహనరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.యుగంధర్, వి.అప్పలరాజు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పారాయణం.. కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా కొయ్యలగూడెం రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఓం నమో నారాయణ పారాయణం నిర్వహించారు. నాయకులు తోట రవి, మాదేపల్లి శ్రీనివాసరావు, ఏపూరి సతీష్, తాడికొండ మురళి, బొమ్మా బాబు, చోడిపిండి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఈవోగా బాధ్యతల స్వీకరణ



చందన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈవోగా నియమితులైన ఆర్వీ చందన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

అవి ఇవి అన్నీ

పురస్కార గ్రహీతకు సత్కారం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న కుంతలగూడెం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణను సహోపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం సత్కరించారు. పాఠశాలలో ఎస్ఎంసీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎస్.రమేశ్, అమృత, రూత్‌పాలినా, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మించాలని వినతి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: మండలంలోని 100 రామన్నపాలెంలో అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మించాలంటూ కేవీపీఎస్, జనసేన పార్టీ నాయకులు బరింకలపాడులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజును మంగళవారం కలిసి విన్నవించారు. ప్రాన్సిస్, రాజేష్, బాబూరావు, శ్రీదేవి, అలేఖ్య తదితరులు ఉన్నారు.

ఇసుక నిల్వ కేంద్రం ఏర్పాటు చేయాలి

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడిలో ఇసుక నిల్వ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ డీఎల్ ప్రమద్వరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చింతలపూడి పరిధిలో అయిదు వేల మంది భవన నిర్మాణ కార్మికులున్నారని, వారిని దృష్టిలో ఉంచుకుని నిల్వ కేంద్రం ఏర్పాటు చేస్తే ఉపాధి దొరుకుతుందన్నారు. తమ్మిలేరు నుంచి ఇసుక తెచ్చుకోవడానికి అనుమతి ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో చేపల్లి శ్రీను, జూపూడి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్ ఏర్పాటు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేసి, అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శేషుకుమారి అధ్యక్షత వహించగా జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లీలాకుమార్ తెలిపారు. గత నెల 21న దేవరపల్లి మండలం పల్లంట్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో కె.రాజేశ్, బాలికల విభాగంలో కె.జాస్మిన్, సెప్టెంబరు 30న ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన హ్యాండ్‌బాల్ అండర్-17 పోటీల్లో బాలికల విభాగంలో కె.మణిదీప్తి, అండర్-14 బాలుర విభాగంలో ఎం.తేజ, నరసాపురం మండలం ఎల్బీచర్ల సాంఘిక సంక్షేమ పాఠశాలలో నిర్వహించిన 'టచ్ రగ్బీ' క్రీడలో అండర్-14 బాలికల విభాగంలో శ్రావణి, శరణ్యమల్లీశ్వరి, అండర్-17 బాలిక విభాగంలో కె.కీర్తి, బాలుర విభాగంలో జశ్వంత్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.



విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్

వెలవెలబోయిన మండల సర్వసభ్య సమావేశం

వేలేరుపాడు (కుక్కునూరు), న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, అధికారుల గైర్హాజరుతో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన వేలేరుపాడు మండల సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. తొమ్మిది మంది సర్పంచులకు గాను ఇద్దరే హాజరయ్యారు. ఎంపీటీసీలు ఏడుగురుకు ఎంపీపీతో కలిపి ముగ్గురు మాత్రమే వచ్చారు. ప్రధాన శాఖల అధికారులెవరూ రాలేదు. మూడు నెలలకోసారి జరిగే సమావేశంలో ప్రధాన అంశాలు చర్చించాల్సి ఉండగా, సరైన సమాచారం ఇవ్వకపోవడంపై జడ్పీటీసీ సభ్యురాలు రామలక్ష్మి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పాత పూచిరాలలో మూడు నెలలుగా తాగునీటి సమస్య ఉందని, ఈ విషయాన్ని తాను అనేక సార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, తహసీల్దార్ సత్యనారాయణ, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు మేడవరపు నాగశ్రీ, కేసగాని వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై బిందు సేద్య పరికరాలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బిందు సేద్య పరికరాలపై ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రవికుమార్ సూచించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గవరవరం, రాజవరం గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఉపయోగపడేలా అయిదెకరాల లోపు రైతులకు 90 శాతం, ఆపై 50 శాతం రాయితీ దక్కుతుందన్నారు. వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవరెడ్డి మాట్లాడుతూ భూమిలో పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ఎండాకు తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి రైతుల సందేహాలను మండల ఉద్యానశాఖాధికారి ధీరజ్ లక్ష్మణ్ నివృత్తి చేశారు. మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు మాట్లాడుతూ ఈ నెల 3లోగా ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. కొయ్యలగూడెం పశువైద్యాధికారి శ్రీనివాసన్, వ్యవసాయ శాఖ సచివాలయాల సహాయకులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

సాగులో మెలకువలపై అవగాహన.. లింగపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని కలరాయనగూడెం, మఠంగూడెం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగులో మెలకువలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మురళీకృష్ణ, పశువైద్యాధికారి మహేశ్, లలిత సుధ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో కలుపు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తడికలపూడి పోలీసుల కథనం మేరకు.. ద్వారకాతిరుమల మండలం కోడిగూడేనికి చెందిన డొక్కా పెంటయ్యకు.. కామవరపుకోట మండలం రావికంపాడుకు చెందిన మహిళతో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహమైంది. కొద్ది రోజుల తరువాత పుట్టింటికి వెళ్లిన ఆమె తిరిగి కాపురానికి రాలేదు. ఈ విషయమై గత నెల 27న పెంటయ్య గొడవపడ్డాడు. అనంతరం కలుపు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు తొలుత జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై మృతుడి తల్లి పుల్లమ్మ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రామ్‌కుమార్ మంగళవారం కేసునమోదు చేశారు.

బాలిక అదృశ్యం.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన బాలిక (15) గత నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎన్.ఉమామహేశ్వరరావు కేసునమోదు చేశారు.

జూదరుల అరెస్టు.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: సింగరాయిపాలెంలో జూద స్థావరంపై దాడి చేసి, ముగ్గురిని అరెస్టు చేసి, రూ.3,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.జయబాబు మంగళవారం తెలిపారు.

కలప ట్రాక్టర్లు స్వాధీనం.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: మర్రిగూడెం పంచాయతీ గట్టుగూడెం అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం రాత్రి గ్రామస్థులు, వనసంరక్షణ సమితి సభ్యులు పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఎర్రగుంటపల్లి అటవీ అధికారి నాగేశ్వరరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని నిందితులపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు.

భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలు పెంచాలి



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఓఎన్జీసీ అధికారులు

పోలవరం, న్యూస్‌టుడే: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా 'స్వచ్ఛతా హీ సేవా'కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి కృషి చేస్తున్నట్లు ఓఎన్జీసీ రాజమహేంద్రవరం కేజీ-పీజీ బేసిన్ మేనేజర్ కె.కర్ణన్నన్ అన్నారు. పోలవరం మండలం కొండ్రుకోట, సాగిపాడు పునరావాస కాలనీల్లో ఇంటికి మూడు చొప్పున 622 ఇళ్లకు ఐటీడీఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మామిడి, కొబ్బరి, సపోట మొక్కలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొన్నింటిని నాటారు. చీఫ్ జనరల్ మేనేజరు పీవీఎస్ ప్రసాద్, జనరల్ మేనేజరు పాల్ జయవర్, కేతీ కెమాస్, కె.ముత్తయ్య, సర్పంచి పైడా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంరక్షకులే.. హరిస్తే ఎలా..?



లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఏళ్ల తరబడి ఉన్న భారీ చెట్లను ఒక్క పూటలో నేల మట్టం చేశారు. నిత్యం కార్యాలయానికి వచ్చే ప్రజలు వాటి నీడలో సేద తీరుతూ అధికారుల కోసం వేచి చూస్తారు. సాక్షాత్తు ప్రభుత్వ కార్యాలయంలో భారీ చెట్లను నరికి వేయడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై తహసీల్దార్ మహమ్మద్ నజీముల్లాషా మాట్లాడుతూ భారీ గాలులు వీచినప్పుడు కార్యాలయానికి వచ్చే వారికి చెట్లు ప్రమాదకరంగా ఉండటంతో తొలగించామని చెప్పారు. వాటి స్థానంలో ఇతర మొక్కలు నాటుతామని పేర్కొన్నారు.

విద్యతోనే కుల వ్యవస్థ నిర్మూలన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిరావుపులే స్థాపించిన సత్య శోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక ధర్మన్న స్మారక భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి సముద్రాల సుందరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఇఫ్టూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాలి రాజశేఖర్ మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు విద్య అందినప్పుడే కుల వ్యవస్థ నిర్మూలన అవుతుందన్నారు. సభలో పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాల పూనెం పార్వతి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్, నాయకులు కాళీబాబు, బత్తుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అక్రమ నిల్వలపై విజిలెన్సు దాడులు



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బయ్యనగూడెంలో ఎరువుల అక్రమ నిల్వలపై విజిలెన్సు, వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. బయ్యనగూడేనికి చెందిన ఎంఎస్ మనోజ్‌కుమార్‌కు చెందిన గోదాములో రూ.8,26,560 విలువైన 32.10 టన్నుల ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అదే గ్రామంలో ఒ.హేమనాగేంద్రకుమార్‌కు చెందిన దుకాణంలో రూ.2,82,800 విలువైన 16.40 టన్నుల ఎరువులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేల్చారు. ఆయా ఎరువులను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏవో పి.సురేష్, తహసీల్దార్ బి.కన్యాకుమారి, కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవ



చెత్త శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నూజివీడు కోర్టు ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం చెత్త, వ్యర్థాలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు నాగశైలజ, షేక్ ఖాసిం, హరిబాబు, శివసాగర్‌రావు, కృష్ణమూర్తి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సీహెచ్ మస్తానయ్య

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా ఎ.మస్తానయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పి.వెంకటరమణ గుడివాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీలో భాగంగా దుకాణాల కోసం అక్టోబర్ 1 నుంచి 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా జె.రాణిని ఉన్నతాధికారులు నియమించారు. ఆమె ప్రస్తుతం ముసునూరు ఎంపీడీవోగా పని చేస్తున్నారు. మంగళవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు:	99486 40551	కైకలూరు:	73060 88555
ముసునూరు:	93983 81268	కలిదిండి:	90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణంలోని ఉషోదాలనగర్ పెట్రోల్ బంక్ వెనుక మొదటి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో మురుగునీరు ఖాళీ ప్రదేశాల్లో రోజుల తరబడి నిల్వ ఉండి దుర్వాసన, దోమలు, పందుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

సమాధానం: వెంటనే శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లి చర్యలు తీసుకుంటాం. - నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: గోపవరం బీసీ కాలనీలో అక్కడక్కడ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి. -కె.రంగారావు, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం. - ఆర్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి

ముదినేపల్లి, న్యూస్‌టుడే

సమస్య: ముదినేపల్లి నుంచి ఉప్పుగూడెం వరకు రహదారికి ఇరువైపులా ముళ్ల కంపలు విపరీతంగా పెరిగిపోయాయి. వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదు. - ఉప్పుగూడెం గ్రామస్థుడు

సమాధానం: రహదారి నిర్మాణానికి నిధులు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే గుత్తేదారులతో మాట్లాడి పనులు చేయిస్తాం. ప్రస్తుతం దారుల సహకారంతో కొంత వరకు మరమ్మతులు నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నాం. - సత్యఅరవింద్, ఆర్అండ్‌బీ ఏఈ

చాట్రాయి, న్యూస్‌టుడే

సమస్య: చనుబండలో ఎన్ఎస్పీ కాలువ రోడ్డులో పైపు లీకేజీతో తాగునీరు వృథాగా పోతుంది. ఆ నీరు ఇళ్ల ముందు నిలిచి అపరిశుభ్రత నెలకొంటుంది. - వెంకటేశ్వరరావు, చనుబండ

సమాధానం: వెంటనే పరిశీలించి కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. - రఘు, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని కొట్టాడలో పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళల్లో మరొక గ్రామానికి రాకపోకలు చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - కేశవ, కొట్టాడ

సమాధానం: కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - శివన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి

నియోజకవర్గ కేంద్రం
మురుగు కాలువలు అధ్వానం!

కైకలూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి ప్రధాన కేంద్రమైన కైకలూరు గ్రామ పంచాయతీగానే ఉన్నా.. మున్సిపాలిటీకి ఏమాత్రం తీసిపోదు.. ఆదాయంలోనూ అగ్రగామిగానే కొనసాగుతోంది. అయితే ఎక్కడా డ్రైనేజీ వ్యవస్థ మాత్రం మెరుగుపడటం లేదు. చిన్నపాటి చినుకులు పడినా కాలనీలు అన్నీ మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. 20 వార్డులు, సుమారు 40 వేల పైచిలుకు జనాభా కలిగిన కైకలూరులో దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. సమస్య వచ్చినప్పుడు నామమా

అంతా ఆర్భాటమే

గ్రామ స్వరాజ్యం అంటూ గొప్పలు చెప్పినా గత వైకాపా పాలనలో అభివృద్ధి ఆమడదూరంలోనే నిలిచింది. ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు ఇస్తున్నాం డ్రైనేజీలు మెరుగు దుస్తాం.. గడప గడపకు మన ప్రభుత్వం అంటూ చేసిన ఆర్భాటమంతా ప్రచారానికే పరిమితమైంది. కొత్త డ్రైనేజీ ఏర్పాటు అటుంచితే ఉన్న వాటిని మెరుగు పరిచేందుకు కనీస చర్యలు చేపట్టకపోవడంతో పలు కాలనీల్లో మురుగు కూపాలుగా మారిపోయాయి. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పంచాయతీల నిధులను పక్కదారి పట్టించడంతో అభివృద్ధి కుంటు పడి కైకలూరుతో పాటు మండలంలోని 26 పంచాయతీల్లోనూ సరైన అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పోయింది.

మురుగు కాలువల నిర్వహణ గత అయిదేళ్లుగా అంతంతమాత్రంగానే ఉండటం ప్రజలకు శాపంగా మారిందనడంలో అతిశయోక్తి కాదు. కైకలూరు పట్టణంలోని డ్రైనేజీలు అన్నీ కలిసే పుల్లవా, శ్యాంప్, వార్డుకోడు డ్రెయిన్లు క్రమబద్ధ కరణకు నోచుకోలేదు. దీంతో మురుగు కాలువలు పూడి పోయి నీరు ముందుకు కదలడం లేదు. దీని ప్రభావంతో ఎన్టీ కాలనీ, వైఎస్సార్ నగర్, కరణప్ప, కొత్తపేట, కమ్మర వీధి, ఇస్లాంపేట, చిన్నాగారి కాలనీ, తదితర ప్రాంతాల్లో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

అంతంత మాత్రమే

తపు చర్యలతో సరిపెట్టడమే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు ముందుకు పడటం లేదు.



కైకలూరు: వెలమపేట గీతా మందిరానికి వెళ్లే రహదారిపై ఇలా..

పట్టణవాసుల కష్టాలు

కైకలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో సుమారు 16 వాటిలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారింది. వర్షాలు పడిన సందర్భం అటుంచితే మందు వేసవిలోనూ మురుగునీరు ప్రధాన రోడ్లపై ప్రవహిస్తోంది. ఇక భారీ వర్షాలు పడితే అంతే సంగతి. మురుగు నీరంతా నివాసితుల ఇళ్లలోకి చేరుతోంది. ముఖ్యంగా వెలమపేట, వెలమపేట కాలనీల్లో డ్రైనేజీ దుస్థితి దారుణంగా మారింది. నిర్వహణ సక్రమంగా లేక పూడిక తీయడంలో అలసత్వం వహించడం పెద్ద సమస్యగా మారింది.

ఈ విషయమై కైకలూరు ఈవోపీఆర్డీ రవిశంకర్ మాట్లాడుతూ.. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కైకలూరులో అంతర్గత మురుగు కాలువ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతులు రాగానే పనులు మొదలు పెడతామన్నారు.

ట్రిపుల్ ఐటీ ఫైనాన్స్ అధికారిణిగా నాగార్జునదేవి

ముసునూరు, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నాగార్జునదేవి ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లకు ఫైనాన్స్ అధికారిణిగా నియమితులయ్యారు. ఈమె గతంలో నూజివీడు క్యాంపస్‌లో ఫైనాన్స్ అధికారిణిగా, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా పనిచేశారు. ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, పరిపాలనాధికారి బి.లక్ష్మణరావు ఆమెకు అభినందనలు తెలిపారు.

'మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఆపాలి'

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల తొలగింపులు, వారిపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. ఆగిరిపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ధరలు పెరుగుదలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మెస్ ఛార్జీలు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు బిల్లులు చెల్లించాలని కోరారు.

మురుగు నీటి రచ్చ.. రహదారిపై గోడ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి బ్రాహ్మణ బజారులో రహదారికి అడ్డంగా గోడను నిర్మించడం మంగళవారం చర్చనీయాంశమైంది. స్థానికుల కథనం మేరకు.. ఆ ప్రాంతంలో ఓ వ్యక్తి భవనం నిర్మిస్తున్నారు. అందులోని నీరు సమీపంలోని పలువురి ఇళ్ల వైపు వెళ్లేలా పైపులు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో తమ ఇళ్ల ముందు బారిన పడే అవకాశం ఉందని పలువురు ఆ మురుగు నీరు కిందకు పారకుండా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్‌ను సంప్రదించగా.. ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.



రైల్వే బోర్డు సలహా సంఘ సభ్యుడిగా చిట్టిబాబు



ముదినేపల్లి, న్యూస్‌టుడే: రైల్వే బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా సింగరాయపాలెంకి చెందిన భాజపా సీనియర్ నాయకుడు మేడిపి లక్ష్మణరావు (చిట్టిబాబు) నియమితులయ్యారు. ఆయనను భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి కొటిప్రోలు కృష్ణ తదితరులు అభినందించారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం: గన్ని



మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు

కైకలూరు, న్యూస్‌టుడే: కూటమి విజయంలో పెద్దన్న పాత్ర పోషించిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎం.పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే కమ్మిలి విఠలరావు అన్నారు. స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గ సమన్వయ కర్త వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో తెదేపా నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త తప్పనిసరిగా పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. రూ.వంద చెల్లించి తీసుకునే సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమాతో పాటు కొండంత భరోసా లభిస్తుందన్నారు. త్వరలో జరిగే ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను చంద్రబాబు నాయుడు అభ్యర్థిగా ప్రకటించారన్నారు. కూటమి నేతలు సమన్వయంగా పనిచేసి ఆలపాటిని గెలిపించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టరుగా ఎన్నికైన కొడాలి వినోద్, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజులను గజమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పి.త్రినాథరావు, విజయలక్ష్మి, ఏసురాజు, పూల రామచంద్రరావు, పి.లక్ష్మీరాజ్, జానీ, శ్రీనివాస చక్రవర్తి, వల్లభనేని శ్రీనివాస చౌదరి, జగన్మోహన్‌రావు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు సభ్యత్వం తప్పనిసరి

కైకలూరు, న్యూస్‌టుడే: భవన నిర్మాణం, ఇతర రంగాల్లో కార్మికులంతా తమ సభ్యత్వాలను క్రమబద్ధీకరించుకోవాలని కార్మికశాఖ సహాయ అధికారి ఎస్.దుర్గారావు అన్నారు. ఈమేరకు స్థానిక బైపాస్ రోడ్డులోని భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో కార్మిక సంఘ నాయకులు, సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే కార్మిక సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలంటే సభ్యత్వం తప్పనిసరి అన్నారు. కార్మికశాఖ జూనియర్ అసిస్టెంట్ సబిత, సిబ్బంది కుమార్, సంఘం నాయకులు యానాల బసవయ్య, నాగిరెడ్డి కొండ, శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ అందరి బాధ్యత



కైకలూరు: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి లక్ష్మి



నూజివీడు: మాట్లాడుతున్న జడ్జి హరిబాబు

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో వృద్ధులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించి న్యాయస్థానాలను ఎలా ఆశ్రయించాలో వివరించారు. న్యాయవాదులు పిచ్చుకల వరప్రసాద్, దేవరపల్లి శివప్రసాద్, బోడపు జయచంద్ర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు, న్యూస్‌టుడే: అందరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు అన్నారు. నూజివీడు విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయం దగ్గర మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ చట్టం, కార్మిక చట్టాలు, మహిళలకు చట్టం కల్పిస్తున్న రక్షణ, బాల్య వివాహాలు, నూతన న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

ముసునూరు, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: తన బ్యాంకు ఖాతాలో నగదు లేనప్పటికీ చెక్కు ఇచ్చిన నేరానికి ప్రతివాది లోకరాజుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కృష్ణమూర్తి తీర్పు ఇచ్చారు. నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్‌కుమార్ 2019 ఆగస్టులో తాడేపల్లి గూడెంకి చెందిన ప్రతివాది లోకరాజుకు రూ.4 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తర్వాత అప్పు తీర్చమని అడగగా.. ప్రవీణ్‌కు రూ.4 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ప్రవీణ్‌కుమార్ ఆ చెక్కును బ్యాంకులో వేయగా.. నగదు లేదని తేలింది. దీనిపై కేసు పెట్టగా విచారణ అనంతరం న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

ముసునూరు, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడికి గాయాలైన ఘటన నూజివీడు పట్టణంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వెంకటప్పయ్య మంగళవారం తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెంకిటి వెళ్తుండగా వాహనం గుంతలో పడి అదుపు తప్పింది. దీంతో కింద పడి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు యువకుడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మహిళలపై కోతుల దాడి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలంలో ఇటీవల కాలంలో కోతుల సంచారం విపరీతంగా పెరిగింది. ప్రజలపై దాడులు చేస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీలో కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న మహిళలపై కోతుల గుంపు దాడి చేశాయి. కాళ్లు, చేతులు, వీపు, మెడపై తీవ్ర గాయాలు చేశాయి. స్థానికులు గమనించి వాటిని తరమడంతో వెంకటేశ్వరమ్మ వాటి బారి నుంచి బయటపడ్డారు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గత వారం రోజుల్లో ఈ కాలనీలో సుమారు అయిదుగురు కోతుల దాడుల్లో గాయపడ్డారని స్థానికులు తెలిపారు.

సినిమా

నూజివీడు పట్టణం

సత్యనారాయణ మినీ	సత్యం సుందరం
సత్యనారాయణ	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మత్తు వదలరా 2
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దేవర
ఆగిరిపల్లి: శ్రీ ఉమ డీలక్స్	కళింగ
కైకలూరు	
విజయలక్ష్మి జీబీ సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	సత్యం సుందరం
శ్రీవెంకటరమణ సినిమాస్	దేవర
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

చిరస్మరణీయుడు బాలయోగి

కైకలూరు, న్యూస్‌టుడే: దివంగత తెదేపా నేత, మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బాలయోగి జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక తాలూకా కూడలిలోని ఆయన విగ్రహానికి తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, కూటమి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎం.పార్థసారధి, కమ్మిలి విఠల్‌రావు, సర్పంచ్ నవరత్న కుమారి, ఉగిరాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని తదితరులు

దసరా ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

కైకలూరు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కైకలూరులోని శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఈవో వీఎన్‌కే శేఖర్‌కు సూచించారు. శ్యామలాంబ, రామలింగేశ్వరస్వామి దేవస్థానాల ప్రధాన అర్చకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కొండా అఖిల్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వై.రాజారావు తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయి అండర్-17 బాలుర విభాగంలో 61 కిలోల కుస్తీ పోటీల్లో ఆ విద్యార్థి సత్తా చాటినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చుక్కపల్లి ట్రస్టు కార్యదర్శి చుక్కపల్లి సుధ, వ్యాయామోపాధ్యాయుడు సీహెచ్ సుధాకర్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఆగిరిపల్లి స్పోర్ట్స్... నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు మండలం గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటల పోటీల్లో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం పి.రామకుమారి తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, యోగా, బ్యాడ్మింటన్, ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయులు శీలం విజయ్ మనోహరం, దోమా విజయలక్ష్మి మంగళవారం బహుమతులు వితరణ అందజేశారు.

క్రీడలతో మానసిక వికాసం



ఎంపికైన క్రీడాకారులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడే క్రీడా పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగాలని పాఠశాలల సముదాయ చైర్మన్ వి.విజయ్ కుమార్ అన్నారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీల్లో క్రీడాకారుల ఎంపిక మంగళవారంతో ముగిసింది. క్రీడల మండల ఇన్‌ఛార్జి పీడీ కోడే రోజా మాట్లాడుతూ ఎంపికైనవారు ఈనెల వారం కైకలూరులో త్వరలో జరగనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఎంఈవో-2 నరేష్ కుమార్, పలు పాఠశాలల పీఈటీలు రత్నారావు, శ్రీను, భాస్కర్, పీఈటీలు చయెంటేశ్వరరావు, పద్మజారాణి, ఏ.పద్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

ముసునూరు, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: మైలవరం మండలం చంద్రాల నుంచి నందిగామకు అక్రమంగా తరలిస్తున్న గోవుల వాహనాన్ని మంగళవారం పోలీసులు నూజివీడు పట్టణంలో అడ్డుకున్నారు. కానిస్టేబుల్ రాధాకృష్ణ, హోంగార్డ్ వెంకటేశ్వరావు స్థానిక పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గోవులు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ గోవుల అక్రమ తరలింపుపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ మంగళవారం నూజివీడులోని శ్రీ శక్తి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుబాసిని, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, జిల్లా అధ్యక్షుడు ముస్తఫా అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా సహాధ్యక్షుడు జి.వి.రావు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేయడంలో యూటీఎఫ్ మేటిగా నిలుస్తుందన్నారు. అనంతరం ముసునూరు మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గరికిముక్కు పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు, గౌరవాధ్యక్షుడిగా జాకబ్‌రాజు, సహాధ్యక్షులుగా పుల్లయ్య, సత్యప్రియ, కోశాధికారిగా నారాయణ, 9 మంది కార్యదర్శులు, ఒక ఆడిట్, పది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.



స్వర్ణోత్సవ సభలో పాల్గొన్న నాయకులు

ఇంటింటికీ వెళ్లి.. పింఛను అందజేసి

ముదినేపల్లి, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి, మండవల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి, కైకలూరు నియోజకవర్గాల్లో తెదేపా, జనసేన, భాజపా నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఆల్లూరులో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముదినేపల్లిలో భాజపా నియోజకవర్గ సమన్వయకర్త అడుసుమిల్లి సాయిక్రిష్ణ, వదాలిలో మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, చిగురుకోటలో తెలుగు మహిళా నాయకురాలు కందేపి పద్మ సొమ్ము అందజేశారు. ● తెదేపా ముసునూరు మండల అధ్యక్షుడు దేవినేని చలారాం ఆధ్వర్యంలో ముసునూరు, రమణక్కపేట, చెక్కపల్లి, కొర్లగుంట, గోపవరం తదితర



మండవల్లి: నగదు అందజేస్తున్న నాయకులు

గ్రామాల్లో కూటమి నాయకులు, అధికారులు పంపిణీ చేశారు. కొండేటి బాబీ, నక్కా యోహాన్, రంగు శ్రీనివాసరావు, పాశం నాగబాబు, తులిమెల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు. ● ఆగిరిపల్లి మండలంలో 96 శాతం మంది లబ్ధిదారులకు పింఛను అందజేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. ● చాట్రాయి మండలంలో 95.01 శాతం పంపిణీ చేశారు. తెదేపా జిల్లా నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి వెంకటేశ్వరరావు, పువ్వాదలు నోబుల్‌రెడ్డి, బొట్టు రామచంద్రరావు, అత్తులూరి శ్రీనివాసరావు, కంపాటి చెన్నారావు, నక్కా రాము తదితరులు పాల్గొన్నారు. ● భాజపా నాయకుడు గంగినేని వరప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి నేతలు మండవల్లిలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే సంకల్పంతో బాపినీడు మాస్టారు కుటుంబసభ్యులు చేస్తున్న సాయం ప్రశంసనీయమని కాసుకుర్తి పాఠశాల హెచ్ఎం ఎన్.వి.మాధవ్‌కుమార్ అన్నారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. మాగంటి బాపినీడు, సువర్చలా మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గతేడాది ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.30 వేల ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: జాతి పిత మహాత్ముని మార్గం అనుసరణీయమని మేడ గంటయ్య కెకోబాబు అన్నారు. మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని అభ్యుదయ ఎన్నో, ఎస్సీ ల్యాండ్స్‌కేప్ పీపుల్ అసోసియేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బొద్దనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు నక్కనబోయిన వేణు, ఆరేపల్లి శ్రీనివాసరావు, వి.జోషి

అవి ఇవి అన్నీ

'సూపర్ సిక్స్' అమలు కోరుతూ ఆందోళన

చాట్రాయి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం దారుణమని సీపీఐ ఎంఎల్ నాయకుడు దుర్గం పుల్లారావు అన్నారు. చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. హెచ్చు రాజేంద్రప్రసాద్, తగరం రాజు, పతిరావు పాల్గొన్నారు.



బాబు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో గాంధీ జయంతిని ఒక రోజు ముందుగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయిందని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు డి.హరినాథ్ ఆరోపించారు. మంగళవారం రమణక్కపేట గ్రామ సచివాలయం వద్ద సీపీఐఎంఎల్ లిబరేషన్, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ధర్నా చేశారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మండవల్లి: కొర్లెర వరద బాధితులకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరకుల పంపిణీ చేశారు. కాకతీయ నగర్‌లో సుమారు వంద కుటుంబాలకు అందించారు. ఐద్వా ప్రతినిధులు శ్రీలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి ఆధ్వర్యంలో ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు.

పార్ట్య పుస్తకాల పంపిణీ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యా సామగ్రి, పార్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని పెయ్యేరు పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మున్సిసా సూచించారు. పాఠశాలలో మంగళవారం రెండో సెమిస్టర్ పార్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తపాలా ఖాతాలు

నూజివీడు, న్యూస్‌టుడే: స్థానిక డా.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బాలికలకు తపాలా శాఖ ఖాతాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. పది సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థినికి సున్న బ్యాలెన్స్ పోస్టల్ ఖాతాలు విద్యా సంస్థకే వచ్చి ప్రారంభించడం అభినందనీయమన్నారు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా సిఫార్సు చేసిన మోతాదు ప్రకారమే ఎరువులను వినియోగించాలని మండపల్లి ఏడీఏ జి.వెంకటమణి సూచించారు. మండలంలోని పెదకామనపూడి, చిగురుకోటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పశు వైద్యాధికారి రామకృష్ణ, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, ఏవో బి.వేణుమాధవ్, ప్రకృతి వ్యవసాయ విభాగం ఎన్ఆర్పీ గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

నూజివీడు: ఏడీఏ జి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో అన్నవరం, హనుమంతుల గూడెంలలో మంగళవారం రైతులతో ముఖాముఖి, పొలాల క్షేత్ర పరిశీలన నిర్వహించారు. ఏవో చాముండేశ్వరి, హెచ్ఈవో హేమ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ఏవో ఎస్.మధుమోహన్ గుళ్లపూడి, వలసపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వీహెచ్ఏ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.